క్లుప్తంగా

మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మిక నాయకులు

కోరుట్ల: మున్సిపల్ కార్మికులకు సెప్టెంబర్ నెల వేతనం వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.రత్నం డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రాజేశ్వర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల 23న దసరా ఉన్నందునా కార్మికుల అవసరాల దృష్ట్యా వేతనాలు జనరల్ ఫండ్ నుంచి విడుదల చేయాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్ ఎండీ ఉస్మాన్, చిట్యాల రాజ్‌కుమార్, సాయికుమార్, రాజయ్య, పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో నిరుద్యోగులు బలి



మాట్లాడుతున్న విజయ్ కుమార్

వెల్గటూర్: విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో ప్రభుత్వ వైఫల్యంతో విద్యార్థులు, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని బీఎస్పీ ధర్మపురి ఎమ్మెల్యే అభ్యర్థి నక్క విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎండపల్లిలో మాట్లాడారు. ప్రవళిక మృతిపై మంత్రి కేటీఆర్ తప్పుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఆమె మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేసి, నిరుద్యోగులకు రూ.మూడులక్షల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కుషనపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బచ్చల స్వామి, ప్రధాన కార్యదర్శి నక్క గంగాధర్, కోశాధికారి ధీకొండ రాజు, నాయకులు పాల్గొన్నారు.

నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ లక్ష్మీనారాయణ

మెట్‌పల్లి: శరన్నవరాత్రోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ లక్ష్మీనారాయణ సూచించారు. పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఉత్సవ కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిమజ్జనం సందర్భంగా నిబంధనలు పాటించాలన్నారు. ముఖ్యంగా డీజేలను వినియోగించవద్దన్నారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకారమందించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై చిరంజీవి ఉన్నారు.

ఆధారాలు లేకుండా డబ్బు తీసుకెళ్లవద్దు



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: రాష్ట్ర శాసనసభ ఎన్నికల దృష్ట్యా అనుమతి లేకుండా ఎలాంటి డబ్బు, ఇతర సామగ్రి తీసుకెళ్లవద్దని పట్టణ ఎస్సై అబ్దుల్ రహీం అన్నారు. సోమవారం రాత్రి జగిత్యాల జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌రోడ్‌లో విస్తృత వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన భరత్ అనే ఆటోమొబైల్ మెటీరియల్ సరఫరా చేసే వ్యక్తి వద్ద నుంచి రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు ప్రజలు ఎలాంటి సామగ్రి తీసుకెళ్లినా వాటికి తగిన ఆధారాలతో తీసుకెళ్లాలన్నారు. ఆధారాలు లేని నగదును గానీ, ఇతర సామగ్రిని తీసుకెళ్తే సీజ్ చేస్తామని తెలిపారు.

పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కలిసిన రైతుబంధు సమితి సభ్యులు

రాయికల్: రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ రాంచంద్రంను సోమవారం జిల్లా రైతుబంధు సమితి సభ్యులు లాల్వావుల రాజేశ్‌యాదవ్, ముద్దం రవీందర్, సురతాని మల్లారెడ్డి, వంశీధర్‌రావు, బైరి వినోద్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతిపాదనలకే పరిమితం

- ఐదేళ్లుగా జాడలేని వాటర్ ఫౌంటేన్లు
- రూ.కోటి తో పతిపాదనలు



అంబేద్కర్ కూడలి



కోరుట్ల పట్టణంలోని నెహ్రూ విగ్రహం వద్ద కూడలి

కోరుట్లటౌన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. 2018లో తయారు చేసిన ప్రతిపాదనల్లో ప్రధానంగా బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం, ఐబీ గెస్ట్‌హౌజ్ కూడలి వద్ద వాటర్ ఫౌంటేన్ల ఏర్పాటుకు సంబంధిత అధికారులు కొలతలు తీసుకున్నారు. ఐదేళ్లు గడిచినా వాటి జాడలేకుండా పోయింది. ఈ రెండు కూడళ్ల వద్ద ఫౌంటేన్ల ఏర్పాటుకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. పనులు మాత్రం ప్రారంభం కాలేదు.

నెహ్రూ విగ్రహం వద్ద..

పట్టణంలోని జవహర్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట వాటర్‌ఫౌంటేన్ ఏర్పాటుకు రూ.15 లక్షలు కేటాయించారు. టెండర్లు పూర్తయ్యాయి. కానీ పనులు మొదలుపెట్టలేదు. వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం ఫలితంగా కూడళ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కూడళ్లలో ఫౌంటేన్ల ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

టెండర్లు పూర్తయ్యాయి



వాటర్ ఫౌంటేన్లు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతం. బస్టాండ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద, ఐబీ గెస్ట్‌హౌజ్ కూడళ్లలో ఫౌంటేన్ల ఏర్పాటుకు రూ.కోటి మంజూరయ్యాయి. టెండర్లు పూర్తయ్యాయి.
– రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు





కథలాపూర్‌లో బతుకమ్మలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, రాయికల్‌లో బతుకమ్మ సంబురాలు

రాయికల్: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాలలో సోమవారం ముందస్తుగా బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల పూలతో బతుకమ్మను అలంకరించి బతుకమ్మ ఆటలడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుమన్, కరస్పాండెంట్ శ్రీనివాస్, చైర్మన్ నర్సింహులు, వైస్ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

కథలాపూర్: మండలకేంద్రంలోని మాస్ట్రో హైస్కూల్‌లో సోమవారం ముందస్తుగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆట పాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాజేశ్, హెచ్ఎం రంజిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మూడో రోజు ఘనంగా సంబరాలు

ధర్మపురి: ఆడపడుచులకు ఇష్టమైన బతుకమ్మ వేడుకలను సోమవారం మూడో రోజు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బ్రాహ్మణ వీధులు, కాశెట్టివాడ, తోట్లవాడల్లో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. స్థానిక శ్రీచైతన్య, నవోదయ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులు బతుకమ్మ ఆట పాటలతో ముంచెత్తారు. కరస్పాండెంట్లు లింగమూర్తి, అంజిబాబు, ఆంజనేయులు, హనుమయ్య, అధ్యాపకులు విద్యార్థినులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రిదేవీ అలంకరణలో అమ్మవారు



మల్లాపూర్‌లో మహిళల పూజలు



రాయికల్‌లో గాయత్రిదేవీగా అమ్మవారు

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని సోమవారం గాయత్రిదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెగడపల్లి: మండలంలో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. పెగడపల్లి, ఆరవెల్లి, మద్దులపల్లి, బతికపల్లి, కీచులాటపల్లి, నందగిరి గ్రామాల్లో ప్రతిష్ఠించిన అమ్మవారు సోమవారం గాయత్రీదేవి బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనమిచ్చి ప్రత్యేక పూజలందుకుంది. పూజలనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మల్లాపూర్: మండల కేంద్రంలోని వాసవీ కన్యకపరమేశ్వరీ మాత ఆలయంలో సోమవారం మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దుర్గాదేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శివ రాంకిషన్‌గుప్తా, మాజీ అధ్యక్షుడు శివ శ్రీనివాస్‌గుప్తా, ఆలయ అర్చకులు రమేశ్, వాసవీక్లబ్ అధ్యక్షుడు మేడి రాకేష్ సభ్యులు నాగభూషణం గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మచారిణి రూపంలో దుర్గామాత

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు అన్నిగ్రామాల్లో సోమవారం శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో రోజు బ్రహ్మచారిణి రూపంలో దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పలువురు మహిళలు దుర్గామాత అమ్మవారికి ఒడుబియ్యంతో మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రప్రభ వాహనంపై శ్రీవారు

కోరుట్ల: పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో దసరా శరన్నవరాత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. భాగంగా సోమవారం రెండోరోజు వేంకటేశ్వర స్వామి చంద్రప్రభ వామనంపై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తూ పూజలు అందుకుంటున్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం స్వామివారికి, అమ్మవార్లకు పల్లకిసేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు వొద్దిపర్తి మధుకుమారాచార్యులు, సర్పంచ్ గుడిసె శ్రీమతి, భక్తులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం

కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



బండలింగాపూర్‌లో మహిళలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లిరూరల్: అన్ని వర్గాల సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయమని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. మండలంలోని బండలింగాపూర్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రానున్న ఎన్నికల్లో తన కుమారుడు సంజయ్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఇటీవల కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో పేదలకు ఎంతో భరోసానిస్తుందని తెలిపారు. కోరుట్ల నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. అనంతరం జిల్లా సరిహద్దు శివారులోని గండి హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి సరోజ, మెట్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దుర్గామాతకు ఎమ్మెల్యే దంపతుల పూజలు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలో దుర్గాదేవి సేవా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాతకు, కొత్త బస్టాండ్ వద్ద కందకం గడ్డకాపు సంఘం యూత్ సభ్యులు ఏర్పాటు చేసిన దుర్గామాతకు ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సతీమణి సరోజ, ఎంపీపీ జాజాల భీమేశ్వరి, మెట్‌పల్లి ఎంపీపీ మారు సాయిరెడ్డి, మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేసుకుంటున్న గంగాధర్

సారంగాపూర్: జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (తెలంగాణ) అభ్యర్థిగా పోటీ చేయడానికి మండలంలోని పెంబట్ల గ్రామానికి చెందిన కాముని గంగాధర్ సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. జగిత్యాల అసెంబ్లీ స్థానానికి తనకు పోటీచేయడానికి అవకాశం కల్పించాలని కోరుతూ హైదరాబాద్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (తెలంగాణ) కార్యాలయంలో ఆయన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పిట్ట రాంరెడ్డి, లింగారెడ్డి, బెజ్జంకి అనిల్‌కుమార్‌కు తన దరఖాస్తు పత్రాలను అందించారు. తనకు జగిత్యాల అసెంబ్లీ నుంచి పోటీచేసే అవకాశం కల్పిస్తే పార్టీ అధ్యక్షురాలు షర్మిల అక్క సహకారం, నియోజకవర్గ ప్రజల దీవెనలతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేసాడు.

సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

కథలాపూర్: మండలంలోని రాజారాం తండాలో శ్రీ జగదాంబ– సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తి చేసి భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల్లో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, ఎంపీపీ జవ్వాజి రేవతి, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ బొడ్డు బాలు, సర్పంచ్ లవుడ్యా సరిత, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ నియామకం



నూతన కమిటీ సభ్యులు

గొల్లపల్లి: యూత్ కాంగ్రెస్ మండల కమిటీని సోమవారం నియమించారు. కన్వీనర్‌గా పురంశెట్టి గౌతమ్, ప్రధాన కార్యదర్శులుగా సకంటి చంద్రశేఖర్, ఎకల్దేవి లక్ష్మణ్, కోలగాని వేణు, ఉపాధ్యక్షులుగా ఓర్స్ విజయ్, కొలగాని తిరుపతి, సాన మహేశ్, కో కన్వీనర్‌గా రమేశ్, సంయుక్త కార్యదర్శులుగా బెల్లం మహేశ్, మరికంటి నవీన్, బీరుదల మల్లేశ్, రాజశేఖర్, సహాయ కార్యదర్శిలుగా ఒరుగంటి అశోక్, శివ, మధు సోషల్ మీడియా కన్వీనర్‌గా రాజారామ్ మోహన్‌రెడ్డి, కో కన్వీనర్‌గా జాలిగాం నరేశ్, ప్రచార కార్యదర్శులుగా తుడం నవీన్, సంగపు జైసన్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్ కుమార్ గెలుపునకు పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు.

'మోసపూరిత హామీలు ఇవ్వడంలో సీఎం టాప్'

కథలాపూర్: మోసపూరిత హామీలు ఇవ్వడంలో సీఎం కేసీఆర్ టాప్ అని, పదేళ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవడమే దీనికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ చేనేత రాష్ట్ర కార్యదర్శి పులి హరిప్రసాద్ ధ్వజమెత్తారు. మండలంలోని పోతారంలో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. పెళ్లైన దంపతులకు సంతానం కలిగిన కొత్త రేషన్ కార్డులు ఇవ్వని చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. పదేళ్లు అధికారంలో ఉండి వంటగ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించకుండా.. ఇప్పుడు రూ.400 కే ఇస్తామనడం ఎన్నికల జిమ్మిక్కుల కోసమేనని మండిపడ్డారు. నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడంపై బీఆర్ఎస్ నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు చిలివేరి రవి, కుప్ప రాజారెడ్డి, రత్నానాయక్, భీమయ్య, కొమురయ్య, పెద్ద మల్లేశ్, గంగారాం పాల్గొన్నారు.

దళితబంధు జాబితాపై ఆందోళన

- ఎంపీపీని నిలదీసిన దళిత మహిళలు
- తర్వాత జాబితాలో అందరికీ వచ్చేలా చూస్తానని ఎంపీపీ హామీ
- జాబితా రద్దు చేయాలని పట్టుబట్టిన దళితులు



జగదేవుపేటలో ఎంపీపీని నిలదీస్తున్న మహిళలు



కమలాపూర్‌లో దళితుల ఆందోళన

వెల్గటూర్: మండలంలోని జగదేవుపేటలో ఇటీవల ప్రకటించిన దళితబంధు, గృహలక్ష్మి లబ్ధిదారుల జాబితాలో బీఆర్ఎస్ నాయకులు, వారి బంధువులకే కేటాయించారని పేర్కొంటూ దళితులు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, ఆమె భర్త లింగయ్యను దళిత మహిళలు చుట్టుముట్టి నిలదీశారు. ఇళ్లు, భూములు లేని నిరుపేదలకు కాకుండా భూములు, ట్రాక్టర్లు, జేసీబీలు ఉన్నవారికి ఎలా కట్టబెడతారని ప్రశ్నించారు. మరోవిడత జాబితాలో అందరినీ చేర్చుతానని ఎంపీపీ సముదాయించారు. జాబితా పూర్తిగా రద్దు చేసి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ధర్మపురి: ప్రభుత్వం ప్రకటించిన దళితబంధులో అర్హులైన వారికి కాకుండా బీఆర్ఎస్ నాయకులు, అనర్హులకు ప్రకటించంపై దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని కమలాపూర్‌లో సోమవారం గ్రామపంచాయతీ ఎదుట దళితులు బైఠాయించి ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులను ఎంపిక చేసారని సర్పంచ్, ఎంపీటీసీ కార్యాలయానికి రావాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబాలకు 'జువ్వాడి' పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణారావు

మల్లాపూర్: మండల కేంద్రానికి నోముల నర్సారెడ్డి, గుండంపల్లిలో గుర్రాల భువనేశ్వర్, నూతిపెల్లి వెంకట్, గొర్రెపల్లిలో గడ్డం నర్సయ్య వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాలను సోమవారం పీసీసీ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. ఆయన వెంటన పుండ్ర శ్రీనివాస్‌రెడ్డి, సుంకేటి నారాయణరెడ్డి, మామిడి లక్ష్మారెడ్డి, మండల నాయకులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని యామాపూర్ మోత్కూరి రాజాగౌడ్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని సోమవారం జువ్వాడి కృష్ణారావు పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చుక్కరెడ్డి, దేవరెడ్డి, రాములు, ప్రశాంత్, అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

నాగిరెడ్డికి డాక్టరేట్ ప్రదానం



నాగిరెడ్డి

పెగడపల్లి: మండలంలోని రాజరాంపల్లి గ్రామానికి చెందిన నలివెల నాగిరెడ్డి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. గీతాంజలి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. ఉష్ణం, ద్రవ్యరాశి బదిలీ రంగంలో నాగిరెడ్డి అనురాగ విశ్వవిద్యాలయం గణిత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వెంపాటి శ్రీనివాస్‌రావు, జేఎన్టీయూహెచ్ గణిత విభాగం ప్రొఫెసర్ డాక్టర్ బి. రవీంద్రారెడ్డి పర్యవేక్షణలో గణితశాస్త్రంలో పరిశోధనలు నిర్వహించినందుకు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం నాగిరెడ్డికి గణితంలో పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయిని సత్తమ్మ, ఎంపీటీసీ కొత్తపల్లి రవి, ఉప సర్పంచ్ నాగుల రాజశేఖర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గ్రామస్తులు నాగిరెడ్డికి అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టోతో వార్ వన్‌సైడ్

బీఆర్ఎస్ యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్

రాయికల్: సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన ఎన్నికల మేనిఫెస్టోతో వందసీట్లతో బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ సెల్ యూకే అధ్యక్షుడు దూసరి అశోక్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం లండన్ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోతో ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు అందనున్నాయని, దీంతో వందసీట్లు గెలవడం ఖాయమని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడాలేని సంక్షేమ పథకాలు సీఎం ప్రవేశపెడుతున్నారన్నారు.

గత మేనిఫెస్టోపై బీఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల చేయాలి

- మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క

మెట్‌పల్లి: గత ఎన్నికల్లోని మేనిఫెస్టోపై బీఆర్ఎస్ శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే కొమొరెడ్డి జ్యోతక్క డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఆమె మాట్లాడారు. 2018 ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చిన వాటిలో చాలా వాటిని బీఆర్ఎస్ నిలబెట్టుకోలేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాపీ కొట్టిన సీఎం కేసీఆర్.. గత తొమ్మిదేళ్ల పాలనలో చేయలేదని ఇప్పుడు చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గల్ఫ్ ఏజెంట్‌గా ఎంతో మందిని చీటింగ్ చేసిన కేసీఆర్.. రాజకీయాల్లో కూడా అదే బుద్ధి ప్రదర్శిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పూర్తిగా ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభావం తప్పదన్నారు.